క్లుప్తంగా

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం


విలేకరులతో మాట్లాడుతున్న జక్కంపూడి మిత్ర మండలి నాయకులు

ప్రకాశం నగర్: జక్కంపూడి కుటుంబంపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని జక్కంపూడి మిత్ర మండలి నాయకుడు కొత్తపేట రాజా అన్నారు. తన కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్ రాజానగరం నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వారి గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. మెగా ఫ్యామిలీ కోసం తన ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధమని, అయితే అభిమానం వేరు, రాజకీయం వేరు అన్నారు. రాజానగరంలో జక్కంపూడి రాజా గెలుపు తథ్యమని స్పష్టం చేశారు. బత్తుల బలరామకృష్ణ వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని సూచించారు. జక్కంపూడి రాజా వెనుక మెగా అభిమానులు ఉన్నారని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్.సందీప్, మురళీ, రఘు, భాస్కర్, రాజేష్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యం


స్వీప్ ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న నీనా నిగమ్

రాజమహేంద్రవరం రూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుకు అత్యంత ప్రాధాన్యం ఉందని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్ అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్వీప్ ఫొటో ప్రదర్శన కలెక్టర్ మాధవీలతతో కలిసి ఆదివారం సాయంత్రం తిలకించారు. నీనా నిగమ్ మాట్లాడుతూ ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకోవడానికి 85 ఏళ్లు పైబడిన ఓటర్లు ఆసక్తి కనబర్చడం శుభ సూచకమన్నారు. అయితే పట్టణాల్లో ఓటు హక్కును వినియోగించుకునేవారి శాతం తక్కువగా ఉంటుందన్నారు. 85 ఏళ్లు పైబడిన ఓటర్లు ముందుకు వచ్చి ఓటు వేయడం వారందరికీ స్ఫూర్తినిస్తుందన్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం ఉందని, దానిపై వారికి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. అంతకు ముందు మీడియా మానిటరింగ్ సెల్, చెక్‌పోస్టుల సీసీ కెమెరాల పర్యవేక్షణ, సువిధ, సీవిజిల్, ఎంసీసీఎంసీ తదితర విభాగాలను పరిశీలించారు.

శాటిలైట్ సిటీలో ప్రచారం

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ సీబ్లాక్‌లో ఆదివారం సాయంత్రం టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి కుమార్తె కంఠమనేని శిరీష, అల్లుడు రామకృష్ణతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. రాబోవు ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

సీతారాముల పుష్పయాగం



బిక్కవోలు: శ్రీరామనవమి పురస్కరించుకుని మండలంలోని పందలపాక వెలంపేట రామాలయం వద్ద సీతారాముల పుష్పయాగం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు కాజాలు, చలివిడి, అరిసెలు, సున్నుండలు, లడ్డూలు, పాలకోవాలు తదితర 58 రకాల స్వీట్లు, పిండి పదార్థాలను సతీమ్మ సారెగా తీసుకొచ్చి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చీపురుపల్లి ఆనందరావు, సబ్బారపు చిన్నా, వైకుంఠ వెంకటేశ్వరరావు, గొర్రిపోటి వెంకటరమణ, బొడ్డు ముత్యాలరావు, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	: గీతాంజలి మళ్లీ వచ్చింది
సూర్యమినీ	: పారిజాతపర్వం, దిఫస్ట్‌ఒమెన్
సూర్యప్యాలెస్	: గాడ్జిల్లా అండ్ కాంగ్
స్వామి	: ది ఫ్యామిలీస్టార్
శివజ్యోతి	: లవ్‌గురు
అనుశ్రీ	: మంజుమ్మల్ బాయ్స్
రాజా	: బడేమియా చోటేమియా
ఊర్వశి	: హ్యాపీడేస్
రంభ	: లవ్‌యు శంకర్
మేనక	: టెనెంట్
అప్సర	: టిల్లుస్క్వేర్
కుమారి	: మార్కెట్ మహాలక్ష్మి
నామవరం	
వీఎస్ మహల్	: గీతాంజలి మళ్లీ వచ్చింది
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: గీతాంజలి మళ్లీ వచ్చింది

వేసవి ఆటవిడుపు

- మే ఒకటి నుంచి చిన్నారులకు క్రీడా శిక్షణ శిబిరాలు
- అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 50 సెంటర్ల ఏర్పాటు
- చర్యలు తీసుకున్న శాప్


ఫుట్‌బాల్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు (ఫైల్)

ప్రకాశం నగర్: వేసవి కాలంలో వివిధ రకాల క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చర్యలు చేపడుతోంది. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఒక కేంద్రంలో కనీసం 25 మంది బాలురు, 25 మంది బాలికలకు వారి ఆసక్తిని బట్టి అండర్ – 14 విభాగంలో క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, ఖోఖో, హాకీ, కబడ్డీ, హ్యాండ్ బాల్, టెన్నిస్ వంటి క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా క్రీడా అసోసియేషన్లు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, వ్యాయామ శిక్షకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఆసక్తి కలవారు క్రీడ, ప్రాంగణం, ఇన్‌చార్జి, మొబైల్ నంబర్, చిరునామా వివరాలతో ఈజీడీఎస్ రాజమహేంద్రవరం ఎట్‌దరైట్ ఆఫ్ జీమెయిల్.కమ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇలా వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి, అర్బన్, రూరల్‌లలో 50కి తగ్గకుండా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నెల రోజుల శిక్షణ

క్రీడా శిక్షణ తరగతులు మే ఒకటి నుంచి ఆ నెల చివరి వరకూ జరుగుతాయి. వీటిని సుమారు నెల రోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం స్కూల్ గేమ్స్ జగనన్న క్రీడా సంబరాలతో పాటు ఆడుదాం ఆంధ్రా వంటి క్రీడా పోటీలను ఎంతో సమర్థంగా నిర్వహించింది.

క్రీడలకు పెద్ద పీట

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేసి, క్రీడాకారులను ప్రోత్సహిస్తోంది. క్రీడాకారులకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేస్తుంది. గతంలో వివిధ పోటీలు జరిగినప్పుడు క్రీడాకారులకు భోజనం, వసతి సదుపాయాలను దాతల సహకారంతో ఏర్పాటు చేసేవారు. జగన్ పాలనలో ప్రభుత్వంలో వాటిని అందజేస్తుంది. క్రీడాకారులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, స్నాక్స్ వంటివి సమకూర్చుతోంది.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. క్రీడల్లో ప్రతిభ కనబరిచేందుకు ఇటువంటి శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. క్రీడాకారులకు వారికి నచ్చిన ఆటలో శిక్షణ ఇవ్వడంతో పాటు మెళకువలు నేర్పుతారు.
– డీఎంఎం శేషగిరి, జిల్లా చీఫ్ కోచ్


బాక్సింగ్‌లో మెళకువలు నేర్చుకుంటున్న పిల్లలు (ఫైల్)

నవ వధువుపై కుటుంబ సభ్యుల దాడి

కడియం: ప్రేమ వివాహం చేసుకున్న యువతిపై ఆమె కుటుంబ సభ్యులు దాడి చేశారు. కడియంలోని ఆదివారం జరిగిన ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే.. నరసారావుపేటలోని ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో చదువుతుండగా నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం గొడిగనూరు గ్రామానికి చెందిన జి.స్నేహకు కడియం గ్రామానికి చెందిన బత్తిన వెంకటనందుతో పరిచయం ఏర్పడింది. వీరు విజయవాడ కనకదుర్గ గుడిలో ఈనెల 13వ తేదీన వివాహం చేసుకున్నారు. వీరి పెళ్లికి అబ్బాయి తరపున అంగీకారం తెలిపారు. ఈ నేపథ్యంలో కడియంలోని వెలుగుబంటి రామచంద్రరావు కల్యాణ మండపంలో ఫంక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంపై అమ్మాయి తరపు వారికి కూడా సమాచారం ఇచ్చి ఆహ్వానించారు. అయితే స్నేహ కుటుంబ సభ్యులైన పద్మావతి, చేరన్ కుమార్, చందు, నక్క భరత్ ఫంక్షన్ హాల్‌లోకి ప్రవేశించి వాగ్వాదానికి దిగారు. స్నేహ కళ్లలో కారం చల్లి కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారు. ఆమెను భర్త వెంకట నందు రక్షించాడు. నిందితులు స్నేహ దగ్గర నుంచి బంగారు గొలుసు, ఉంగరం, చెవి రింగులు లాక్కెళ్లారు. అక్కడే ఉన్న బత్తిన వీరబాబుపై దాడి చేశారు. గాయపడిన అతడు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కడియం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


విద్యతోనే ఉన్నత శిఖరాలు


కృష్ణబలిజల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్


డివిజన్‌లో పర్యటిస్తున్న ఎంపీ భరత్‌రామ్

- అందరూ తమ పిల్లలను చదివించాలి
- ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని రౌతు తాతాలు కల్యాణ మండపంలో ఆదివారం కృష్ణ బలిజ (బుక్క) సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు మాట్లాడుతూ రాజమహేంద్రవరాన్ని ఎంపీ భరత్ రామ్ అత్యద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. ఆయన ఎమ్మెల్యేగా గెలిస్తే నగరం మరింత సుందరంగా మారుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్‌కు మద్దతు తెలియజేస్తున్నామన్నారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ కృష్ణ బలిజ సామాజిక వర్గీయులు అన్ని రంగాలలో చైతన్యవంతులు కావాలన్నారు. ఎంపీగా నగరం రూపురేఖలు మార్చేందుకు సాధ్యమైనంత వరకూ కృషి చేశానని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. టీడీపీ నేత ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండని ప్రజలను ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారో అర్థం కావడం లేదన్నారు. మంచి జరిగిందని భావిస్తేనే తనను ఎమ్మెల్యేగా గెలిపించమని అభ్యర్థించారు. సమావేశంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, మాజీ కార్పొరేటర్ గూడూరి రాధిక, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, సంఘ పెద్దలు, మాజీ కార్పొరేటర్లు అరవ సురేష్ కుమార్, బెజవాడ రాజకుమార్, బెజవాడ రంగారావు, మామిడిపల్లి రామకృష్ణ, పిల్లాడి పరమహంస పాల్గొన్నారు.


కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలపై సంతకం చేస్తున్న భరత్‌రామ్

నామినేషన్ పత్రాలపై సంతకం

నగరంలోని ఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఎంపీ భరత్‌రామ్ ఆదివారం సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల సన్నిధిలో తన నామినేషన్ పత్రాలపై సంతకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన అత్యంత ఇష్టమైన దైవం పరమేశ్వరుడు అన్నారు. ఆయన సన్నిధిలో ఏ కార్యక్రమం తలపెట్టినా దిగ్విజయం అవుతుందన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిస్తే చేసే అభివృద్ధి పనులపై త్వరలో మేనిఫెస్టో కూడా విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. ఆయన వెంట బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, మార్గాని సురేష్, అరిగెల బాబు, ఎం సుభాష్ రెడ్డి ఉన్నారు.

విశ్వ నగరంగా తయారు చేస్తా

ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే రాజమహేంద్రవరాన్ని విశ్వనగరంగా అభివృద్ధి చేస్తానని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. 41వ డివిజన్‌లోని కోటిలింగాలపేటలో ఆదివారం ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేశారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఏపీలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను తెలుసుకునేందుకు కొన్ని రాష్ట్రాల నుంచి అధికార, అనధికార బృందాలు అధ్యయనం చేయడానికి ఇక్కడకు వచ్చాయన్నారు. దేశానికే రోల్ మోడల్‌గా ఏపీలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలుస్తుందన్నారు. చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్ పేరుతో ఎలా స్కామ్ చేశారో యావత్ దేశ ప్రజలకూ తెలిసిందన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

మరిడమ్మకు పూజలు

స్థానిక 21వ డివిజన్ అన్నపూర్ణమ్మపేటలో కొలువైన మరిడమ్మ జాతర మహోత్సవానికి ఎంపీ మార్గాని భరత్ రామ్ హాజరయ్యారు. అన్న ప్రసాద వితరణలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక 37వ డివిజన్ వీరభద్రపురం రామాలయాన్ని సందర్శించారు. ఆయన వెంట రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, సిటీ అధ్యక్షుడు అడపా శ్రీహరి ఉన్నారు.

జగన్ పాలనలో అభివృద్ధి పరుగులు


జంగాల కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ, మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు

- ప్రతి కుటుంబానికీ లబ్ధి
- మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, వచ్చే ఎన్నికలలో ఆయన విజయం సాధించి మరోసారి సీఎం కావడం ఖాయమని మంత్రి, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. కొంతమూరులోని జంగాల కాలనీలో ఆదివారం సాయంత్రం స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి వేణు మాట్లాడుతూ లక్షల మందికి ఇళ్ల స్థలాలు అందించడమే గాక, పరిపాలనా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చారన్నారు. పేదవాడికి మంచి చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఆయనను ఎదుర్కొనే ధైర్యం లేక చంద్రబాబు నాయుడు జనసేన, బీజేపీ పార్టీలతో పొత్తు పెట్టుకుని కుటిల రాజకీయం చేస్తున్నారన్నారు. 2014 ఎన్నికలలో ఈ మూడు రాజకీయ పార్టీలు 650 హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో నియోజకవర్గంలో గెలుపు కోసం ఆలోచించడం లేదని, అత్యధిక మెజార్టీయే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, కడలి వెంకటేశ్వరరావు, అత్తిలి భీమశంకరం, తాటికొండ విష్ణు, ఎంఎం అలీ, చెరుకూరి సత్యనారాయణ, షేక్ చానా, వీర్లపల్లి ఏసు, పరిమి దుర్గారావు, లాయర్ శ్రీను, ఆచంట సుబ్బారాయుడు, ఆచంట కల్యాణ్, కోటి, కోల్లి నాని, షేక్ బాజీ, మౌలాళీ, గాబ్రియల్, షేక్ కరీముల్లా, పిల్లా శ్రీను, గెడ్డం శ్రీను, మానేపల్లి సుగుణ, పెనుగొండ లక్ష్మణరావు, కోల్లి బాబీ, అల్లాడ గణేష్, నల్లమిల్లి సుబ్బారావు పాల్గొన్నారు.


చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న మంత్రి వేణుగోపాలకృష్ణ

మంత్రి వేణు పూజలు

పిడింగొయ్యిలోని రామాలయంలోని స్వామివారిని మంత్రి వేణు దర్శించుకున్నారు. బుచ్చయ్యనగర్ రాక్‌చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. బుచ్చయ్య నగర్‌లో సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలకు హాజరయ్యారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రేలంగి సత్యనారాయణ, హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, మాజీ ఉప సర్పంచ్ తెల్లమేకల సత్యనారాయణ, రాఘవరెడ్డి, జాజుల శ్రీను, రేలంగి పెద్ద సత్యనారాయణ, వేముల ఏసుబాజు, ఇబ్రహీం బాషా తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతులలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ హౌసింగ్ బోర్డ్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

- మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మేడూరి వారి స్ట్రీట్, గానుగ వీధి, శాస్త్రిగారి వీధి, ధనలక్ష్మి వీధి, ప్రకాష్ నగర్ రౌండ్ పార్క్, గాంధీపురం 2, గాంధీ పురం 3, సుధా స్కాన్ ఏరియా, రాజు న్యూరో హాస్పిటల్, లైఫ్ మెడికల్ ఏరియా, శ్యామల నగర్, పంచవటి, జాగృతి బ్లడ్ బ్యాంక్, పోలీస్ స్టేషన్ ఏరియా, రామాలయం సెంటర్, దానవాయిపేట గాంధీ పార్క్, మేడపాటి అమ్మిరెడ్డి వీధి, ఆదిత్య హాస్పిటల్, విజయ్ హాస్పిటల్, టిప్సీ టాప్సీ, సురుచి స్వీట్స్, బైపాస్ రోడ్డు, బాటా షో రూమ్, ప్రదీప్ హాస్పటల్ అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నేతాజీ నగర్, జేఎల్‌బీ నగర్, బృందావన కాలనీ, ఏసీబీ కాలనీ, రాఘవేంద్ర నగర్ కాలనీ, బొమ్మూరు చెరువు, వెంకటగిరి కొండ, బాలాజీపేట సెంటర్, వెంకటేశ్వర నగర్‌లో విద్యుత్ ఉండదు.
- ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ కాతేరులోని దాసరి నగర్, ఇండస్ట్రియల్ కాలనీ, పంచాయతీ ప్రాంతం, చౌదరి పేట, దేవాంగులపేట, సీతానగరం రోడ్డు ఏరియాల్లో సరఫరా ఉండదు.
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కొంతమూరులోని సాయి నగర్, శ్రీరామ్ నగర్, అఫీషియల్ కాలనీ, బూసమ్మ కాలనీ, పిల్లావారి వీధి, బెల్లంకొండ వారి వీధి, అంబేడ్కర్ పేట, పంచాయతీ ప్రాంతం, మెయిన్ రోడ్డు, మదర్సా ప్రాంతం, నూకలమ్మ గుడి ప్రాంతం ఏరియాల్లో సరఫరా ఉండదు.

నేత్రదానం

కడియం: నేత్రదానంతో మరోసారి జీవించే అవకాశం ఉంటుందని చిరు సేవాసమితి వ్యవస్థాపకుడు గెడ్డం శివ అన్నారు. తమ సంస్థ సభ్యుడు సుబ్రహ్మణ్యం తండ్రి రామకృష్ణ ఆదివారం ఉదయం కన్నుమూశారన్నారు. వారి కుటుంబ సభ్యుల అనుమతితో రామకృష్ణ కార్నియాను కాకినాడకు చెందిన బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు సిబ్బంది సేకరించాలన్నారు.

ఊపందుకున్న వరికోతలు


దుళ్లలో వరిని కోస్తున్న మెషీన్

కడియం: మండలం పరిధిలో వరి కోతలు ఊపందుకున్నాయి. వాతావరణం అనుకూలంగా ఉండడంతో వేగంగా కోతలు పూర్తి చేస్తున్నారు. యంత్రాల సాయంతో రాత్రి పది గంటల వరకు కోతల ప్రక్రియను రైతులు కొనసాగిస్తున్నారు. మండల కేంద్రమైన కడియంతో పాటు, వేమగిరి, జేగురుపాడు, మురమండ, కడియపుసావరం, దుళ్ల గ్రామాల్లో వరిసాగు జరిగింది. దిగుబడి కూడా ఆశాజనకంగా ఉందని రైతులు తెలిపారు. రబీ ధాన్యం కొనుగోలు కోసం ఇప్పటికే కేంద్రాలను ప్రారంభించినట్టు మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి తెలిపారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి


కడియంలో ప్రచారం చేస్తున్న గిరజాల బాబు

కడియం: రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలకు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకులు గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కడియంలోని సచివాలయం 4 పరిధిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎంపీగా గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేగా చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణలను ఫ్యాను గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడాల విష్ణుచక్రవర్తి, కడియం రంగారావు, వట్టికూటి బుల్లిబాబు, మంగు వరప్రసాద్, శిరిగినీడి సత్యనారాయణ, కందా రాజు, పసల రమణ, సమనస గోవిందు, కందుకూరి తులసీ రామ్, ఆర్ ఎస్ఎస్ మూర్తి, కొత్తూరి బాలనాగేశ్వరరావు, శాకా సురేష్, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అందరికీ పథకాలు

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాయని ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ సతీమణి డాక్టర్ సుకీర్తి అన్నారు. మండలంలోని రఘుదేవపురంలో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. పేదల అభ్యున్నతికి నవరత్నాల పథకాలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. చంద్రబాబు అండ్ కోను ప్రజలు నమ్మబోరన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, పార్టీ నాయకులు పిండి రాధాకృష్ణ, గెద్దాడ త్రిమూర్తులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి జగన్ పెద్దపీట


డీఎంఆర్ శేఖర్‌ను సత్కరిస్తున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: సామాజిక న్యాయం గురించి మాటలు చెప్పడమే కాకుండా చేతల్లో చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఓఎన్జీసీ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీఎంఆర్ శేఖర్ అన్నారు. ఆయన శనివారం జనసేన పార్టీకి రాజీనామా చేసి, పాయకరావుపేటలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆదివారం స్థానిక పేపర్ మిల్లు మెయిన్ గేట్ ఎదురుగా గల శ్రీకృష్ణసాయి కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ నాయకుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు అభినందన సత్కారం నిర్వహించారు. డీఎంఆర్ శేఖర్ మాట్లాడుతూ ఎన్నో ఆశయాలు, ఆశలతో సామాజిక న్యాయం కోసం జనసేనలో చేరినప్పటికీ నిరాశే మిగిలిందన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలు బాగా చదువుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలను సీఎం జగన్ తీర్చిదిద్ది, సాకర్యాలు కల్పించి ఇంగ్లిషు మీడియం ప్రవేశపెడితే దాన్ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యతిరేకించడం వింతగా అనిపించిందన్నారు. సీఎం జగన్ విధానాలు నచ్చి, ఆయన ఎస్సీ, బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యతను గ్రహించి వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా శేఖర్ పనిచేసినప్పుడు ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించి, అంబేడ్కర్ విగ్రహాలు, సీటీబోర్లు, రోడ్లు తదితర సదుపాయాలు సమకూర్చారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత, జీవకారుణ్య సంఘం చైర్మన్ బర్రే కొండబాబు, ఎల్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠోత్సవం


ప్రతిష్ఠోత్సవంలో పాల్గొన్న ఓఎన్జీసీ ఈడీ శాంతానుదాస్ దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్స్‌లో నిర్మించిన శ్రీవిజయ గణతి మందిరంలో విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఓఎన్జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎసెట్ మేనేజర్ శాంతానుదాస్ దంపతుల ఆధ్వర్యంలో టెంపుల్ ట్రస్టు తరపున కె.సురేష్‌కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. విజయగణపతి, లలితాత్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వరస్వామి, సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, అయ్యప్పస్వామి తదితర 17 విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచీ ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.